ఎత్తి, సూటిగా చూస్తోంది. మూర్తి ఖంగారు పడ్డాడు.

"నా ఫ్రెండు సరోజ. పక్కింటి రావుగారు వీళ్ళ బాబాయ్, సెలవలకు వచ్చింది. మా మేనత్తగారి అబ్బాయి- మూర్తి" అని ఊర్మిళ పరిచయం చేసింది.

సరోజ "ఏం చదువుతున్నారు ?" అంది.

"ఆనర్స్"

"ఎక్కడ ?"

చెప్పాడు.

"నేనూ అక్కడే ... కాలేజీలో" అంది.

ఆమె అతని కళ్ళల్లోకి చూసి మాట్లాడుతోంది. తొందర, ఖంగారు లేను, నిబ్బరంగా వుంది మూర్తి మాత్రం బెదురుగా క్రిందకు చూస్తూ మాట్లాడేది - ఆమె వదనంలో, కంఠంలో కొట్టుకొచ్చినట్టు కనబడే ఠీవీ, దర్పం చూసి.

సూటిగా చూసే చిన్ని కళ్లు, పొడుగ్గా కొన దేలిన నాసిక పసుపులోకి విరగబోయే చామన చాయ - ఇవన్నీ ఆ ఖంగారులోనే "నోట్" చేశాడు.

మర్రోజు ఆమె అతన్ని వాళ్ళ బాబాయ్‌గారి ఇంటికి తీసికెళ్ళింది. అక్కడున్న మిగతా రోజులన్నీ అతనికి ఆమె సాన్నిధ్యంలో అతి తొందరగా గడిచిపోయాయి.

సెలవులు అయిపోగానే ఇద్దరూ కలిసే బయలుదేరారు వైజాగ్.

ట్రెయిన్ బయలుదేరేముందు రావుగారు "అమ్మాయి ఒక్కతే వుంది-ఏదైనా కావలిస్తే చూడండి. కాస్త మా"సరూ"ని వాళ్ళేరు దాకా జాగ్రత్తగా తీసుకెళ్ళండి" అన్నారుమూర్తితో.

సరోజ గమ్మత్తుగా నవ్వింది.

"నువ్వు దురభిప్రాయంలో వున్నావ్ బాబాయ్ ! వారినే నేను జాగ్రత్తగా తీసుకెళ్ళా"- అసలే మెత్తని మనిషి."

ఆయన తేలిగ్గా నవ్వేస్తూ "నువ్వే చెప్పవోయ్ ! ఆడపిల్ల అంత ధాటీగా మాట్లాడం మంచిదంటావా" అన్నారు.

ఆమెను సంభ్రమంతో చూస్తున్న అతనికా మాటలు వినబడలేదు.

విశాఖపట్నం చేరేముందు ఆమె వాళ్ళింటికి రమ్మనమని ఎడ్రసు ఇచ్చి వెళ్ళిపోయింది.

ఆమెను వెళ్ళిన వేపే చూస్తూ వుండి పోయాడు.

వారంతర్వాత వెళ్ళాడు. ఆ వారం రోజులూ ఆమె అతని మనసులో వెలుగుతూనే వుంది.

"ఇన్నాళ్ళకు వచ్చారా ? వెంటనే వస్తారను కున్నాను" అంది సరోజ.

"ఎందుకలా అంటున్నారు ?" అన్నాడు ఆమె కంఠంలో ధ్వనించిన ధైర్యం తెచ్చు కుంటూ

"మీరే చెప్పండి-ఈ వారం రోజులూ మీరు ప్రతిరోజూ అనుకోలేదా ?"

అలా అని అంత సూటిగా చూస్తుందేమిటి ! ఆ మాట అన్నతర్వాత ఆమె పెదాల చివర మెరిసిన ఆ చిరునవ్వుకోసం రోజూ రావాలనే అనిపించింది.

అతనక్కడ వున్న ఆ సంవత్సరమూ ఆమెను దేవతలా ఆరాధించాడు. అందమూ, దర్పమూ, ఠీవీవున్న ఆ దేవత అనుగ్రహం కోసం అతను వేచియున్నాడు.

ఆమెకు జాజిపూలు ఇష్టం, అది గ్రహించి మూర్తి ఓ రోజు ధైర్యంచేసి జాజిమాల తీసు కొని వెళ్ళాడు. ఆమెకు ఇవ్వడానికి ధైర్యం లేదు. లాల్చీ జేబులో నలిగిపోతోందిమాల.

"నా కోసమని తెచ్చి జాజులు ఇవ్వడం మరిచి పోయినట్టున్నారే ?" అంది.

"మీకెలా తెలిసింది ?" గొణిగాడు.

"జాజిపూలైతే దాచావుగాని, సువాసన విరజిమ్మేస్తోంది గదండీ : చప్పున ఇవ్వండి"

అతని హృదయం ఉప్పొంగి పోయింది, ఎంతో భక్తితో ఇచ్చాడు.

ఆ తర్వాత వెళ్ళినప్పుడల్లా జాజిపూలు పట్టు కెళ్ళేవాడు, ఆమె అభిమానంతో స్వీకరించేది.

చదువు అయిపోయి విడిపోయే రోజు లొచ్చాయి. ఆరోజు బీచ్‌లో అతనికి తొందరగా వుంది.

ఆమె చేతికి జాజులు అందించి "చాలా

